# పడిలేచిన కెరటం

## – గంటి భానుమతి



*(గత సంచిక తరువాయి)*

" ఇంత రాత్రి వేళ ఏ౦విటీ న్యూసెన్స్ ? " అంటూ సరిగ్గా అదే సమయానికి. నాన్నగారు వచ్చారు. వస్తూనే నా దగ్గరికి వచ్చి అమ్మఖాళీ చేసిన కుర్చీలో కూచున్నారు. ఏదో అంటున్నారు, అమ్మతో ఏదో మాట్లాడుతున్నారు. నాకేం అర్థం కావడంలేదు.

" ఆ డాక్టరిచ్చిన మందులు అవీ వాడుతున్నాం కానీ ఏదో గాలి సోకింది. అక్కడెక్కడో ఎవరో ఓ స్వామిగారు ఉన్నారు,ఓ సారి తీసుకెళ్తే"

స్వామి అన్న మాట వినిపించింది,అంతే మళ్ళీ లోపల్నించి కోపం వచ్చేసింది

"నేనెక్కడికి రాను" అని గట్టిగా అరిచాను. అమ్మ ఏదో అనబోయింది. నాన్న వెంటనే బాల్కనీ లోంచి లోపలికి వెళ్ళిపోయారు. అమ్మని లోపలికి రమ్మన్నారు.

"మనకో ఇల్లుంది అందులో మాట్లాడుకోవచ్చు, ఈ బాల్కనీ జస్ట్ కూచోడానికి,అంతేకానీ ఇలా ఆర్గ్యూ చేసుకోడానికి కాదు"

అమ్మ ఏం మాట్లడలేదు.నేను కూడా లోపలికి వచ్చేసాను.

" నిజమే, అది బాల్కనీలో గట్టిగా అరిచింది. దానికి ఏం తెలీదం లేదు. నీకు తెలుసు కదా,ఇప్పుడు దానితో పాటూ మనం కూడా గట్టిగా మాట్లాడామనుకో, బయటంతా నిశ్శబ్దంగా ఉంది. అందరికీ వినపడుతుంది. అందరూ లేస్తారు. దీనికేదో అయిందని,మనకేదో అయిందనుకుంటారు. ఎంతో సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వస్తుంది. మనది మనమే బయట పెట్టుకున్నట్లవతుంది "అంటూ బాల్కనీ తలుపు వేసేసారు.

నాకు కోపం వచ్చిది. "అంటే నా మూలంగా , చుట్టు పక్కల వాళ్ళు మూలంగా అవమానం జరుగుతుందా!" వెంటనే గట్టిగా అరిచాను.

ఇద్దరు గబగబా నా దగ్గరికి వచ్చారు. " మెల్లిగా మాట్లాడమ్మా. అందరికీ వినపడుతుంది "

" ఏం వినపడితే ? వినపడితే వినపడనీ.ఇప్పుడు నువ్వేం అన్నావ్ నాకు పిచ్చా ? నాకు పిచ్చంటావా.అందు కని ఆ స్వామి దగ్గరికి తీసుకెళ్తారా ? నాకు పిచ్చేంటి ? నాక్కాదు.నీకు పిచ్చి ? నేను మామూలుగానే ఉన్నాను నాకేం పిచ్చి లేదు,అయినా పిచ్చి అని అంటారా" ఆ మాటే పైకి అంటూ ఏడ్చేసాను.

" లేదులే ఏదో తెలీక మీ అమ్మ అనేసింది. నీకేం పిచ్చి లేదు. నిన్ను ఏ స్వాముల దగ్గరికి తీసుకెళ్ళం "

" నేను ఏం అన్నాను ? ఆ స్వామివారి దగ్గరికి తీసుకెళ్దాం అని. అంతకన్నా ఏంఅన్నాను?"

"అన్నీ అనేసి ఏం అన్నానంటున్నావు అయినా ఈ. డిప్రెషన్ కి ఆ బాబా ఏం చేస్తాడు ? సైకియాట్రిస్ట్ దగ్గరికి తీసుకెళ్ళాం , ట్రీట్మెంటు ఇప్పిస్తున్నాం. మళ్ళీ డాక్టరు దగ్గరికి వెళ్ళాలి. మందులు పూర్తిగా వాడాం కదా, ఏం జరుగుతోందో ఆవిడకి చెప్పాలి. అతే కానీ ఈ బాబాలూ స్వాములూ ఏంచేస్తారు ?"

నా ముందరే వాళ్ళు వాదించుకుంటున్నారు. నేను గదిలోకి వెళ్ళాను. పదిహేను రోజులూ అయిపోయాయి. డాక్టరు రాసిచ్చిన మందులు అయిపోయాయి. నాన్నగారు అపాయింట్మెంట్ తీసుకున్నారు.

మళ్ళీ ఆ డాక్టరు.మళ్ళీ అవే నిద్ర మందులు. ఆ తరవాత ఇలాగే ఈ గదిలో, ఈ చీకట్లో,ఈ మంచం మీదే దొల్లుతూ. ఇంతేనా! దీని తరవాత జీవితం లేదా ! ఉంది. కాని, నేను అందులోకి తొంగి చూడడానికి ఇష్టపడడం లేదు. నేను మారాలి. ఇది వరకూ లాగా అయిపోవాలి.

మెల్లిగా లేచాను. పుస్తకాల షెల్ఫ్ దగ్గరికి వెళ్ళాను. ఎందుకో చూడబుద్ధి కాలేదు. ఆ పక్కనే ఉన్న అద్దంలో మొహం చూసుకున్నాను. స్నానం చేసిన తాజాదనం ఆ ముఖంలో లేదు. అన్నం తిని ఎన్నో రోజులయినట్లుగా ఉంది. లంఖణాలు చేసినట్లుగా నీరసంగా నిద్ర వస్తున్నట్లుగా ఉంది.

పూర్తిగా తెల్లారింది. నాన్న టాబ్లెట్,అమ్మ మంచినీళ్ళతో రెడీగా ఉన్నారు,కాస్సేపు అటూ ఇటూ తిరిగాను. నాకు తెలీకుండానే మంచం మీద వాలిపోయాను,మళ్ళీ నిద్ర. మళ్ళీ అన్నం తినే టైముకి లేచాను.తినేసి పడుకున్నాను.

“శృతీ ,లే లే,సాయంత్రం అయిపోయింది. పడుకున్నది చాలు” అంటూ అమ్మ లేపింది.

బలవంతంగా లేచాను. బాత్రూంలోకి వెళ్ళాను. అమ్మ నా వెనకాలే ఉంది.నా చేయి పట్టుకుని టేబుల్ దగ్గరికి తీసుకెళ్ళింది. నాన్న గారు ఇంకా రాలేదు, అమ్మ వేడి టీ ఇచ్చింది.తాగాను, అమ్మ నేను తాగుతున్నంత సేపు నన్నే చూస్తోంది. ఏదో అడుగుతోంది.

నేనేం మాట్లాడ లేదు. అమ్మ చెప్తున్నది వినిపిస్తోంది. వినడం వేరు వినిపించుకోవడం వేరు.వినడం యాంత్రికం. వినిపించుకోవడం మానసికం. నేను ఇప్పుడు ఓ యంత్రం. నడుస్తూ,ఊపిరి పీలుస్తున్న యంత్రం. అందుకే ఏం వినపడడంలేదు.

ఈ లోకంతో సంబంధం లేనట్లుగా ఉంటున్నాను. కుర్చీలో కూచున్నాను. అమ్మఆ రోజు పేపరు ఇచ్చింది. ఒక్క ముక్క కూడా చదవలేక పోయాను. అక్షరాలు మర్చిపోయినట్లుగా ఉంది. అసలు నేను చదువుకున్నదాన్ని అన్న సంగతి కూడా గుర్తు రావడం లేదు. అందుకని పేపర్ని ఓ పక్కకి పడేసాను.

అది అమ్మ గమనించింది.

“శృతీ, టీవీ చూడు, కాస్త మత్తు అదీ తగ్గుతుంది,రా,ఇలా కూచో ” అంటూ టీవీ పెట్టింది.

నేను ఏం మాట్లాడకుండా,టీవీ ముందు కూచున్నాను. ఏంవిటో అన్నీ అలాగే ఉన్నాయి.ఆస్తి తగాదాలు, అక్రమ సంబంధాలు,విష ప్రయోగాలు, చంపడాలు, నేరాలూ, ఘోరాలూ. ఓ యంత్రం లా చూస్తూనే. అలాగే నిద్ర పోయాను. నేను పడుకున్నానని అమ్మఅనుకో లేదు. చూస్తున్నానని అనుకుంటోంది. అందుకే డిస్టర్బ్ చేయలేదు.

అమ్మ అన్నానికి పిలిచినా వెళ్ళలేదు. నిద్ర వస్తోందని గదిలోకి వెళ్ళి పోయాను. ఎప్పటికో తెలివి వచ్చింది. గది అంతా చీకటిగా ఉంది.పగలో రాత్రో తెలీడం లేదు. మంచం మీద నుంచి లేచాను కానీ నీరసంగా అనిపిస్తుంటే, అక్కడే కింద కూచున్నాను. తెలీకుండా ఆ మత్తులో అక్కడే నేల మీద ముడుచుకుని పడుకున్నాను. ఎంత సేపున్నానో తెలీదు. అమ్మ వచ్చి లేపే వరకూ తెలివి రాలేదు.

“ లే.లే.యీ బాత్రూంలో ఇలా పడుకున్నావేంటీ ?”

ఉలిక్కిపడి చుట్టూ చూసాను. ఇది బాత్రూమా ! ఇక్కడికి ఎప్పుడొచ్చాను ! ఆ విషయమే పైకి అన్నాను. దానిగురించే ఆలోచిస్తున్నాను.

“మంచం మీద నుంచి ఎప్పుడు లేచి బాత్రూం కెళ్ళావో ,కానీ ఇక్కడే పడుకున్నావు. ఎంత సేపట్నించి ఇక్కడున్నావో కాని ఇదేం నిద్ర ? ఇదేం మందులో ఏంటో ? డాక్టరు గారికి ఇవన్నీ చెప్పాలి. ఏమీ తగ్గినట్లుగా లేదు. రాను రాను ఎక్కువైపోతోంది ” అంటూ కంగారు పడుతూనే లేపుతోంది.

అమ్మ ఎన్ని సార్లు లేపినా లేవలేక పోతున్నాను. కళ్ళు విడడంలేదు. లేవాలనిపించడం లేదు. బలవంతంగా తెరిచాను. కిటికీ లోంచి వెలుగు కిరణాలు కళ్ళల్లో గుచ్చుకున్నాయి.అది పగలు అన్న విషయం చాలా సేపటికి తెలిసింది. రాత్రంతా పడుకున్నానా! అలా నేలమీద ఉండిపోయానా! లేవడానికి రావడం లేదు. ఏదో పెద్ద జబ్బు చేసినట్లుగా ఫీల్ అవుతున్నాను.

“లే.లేచి మొహం కడుక్కో. నీకు తెలుసా నువ్వు బాత్రూంలో పడుకున్నావు. ఈ సారి ఇంకెక్కడ పడుకుంటావో ! నిన్నొక్క దాన్ని ఉంచడం భయమే. ఇవాళ నుంచి,నువ్వు ఒక్కదానివి పడుకోకు,నేను కూడా నీ దగ్గర పడుకుంటాను ” అంటూ నన్ను లేపింది.

నాకేమీ అర్థం కాలేదు.సగం వినపడింది.సగం వినిపించుకోలేదు.ఏకాగ్రత లేదు.

“ కొంచెం బావుంటుంది.కాస్త కాఫీ తాగితే హాయిగా ఉంటుంది ” వాష్ బేసిన్ దగ్గరికి తీసుకెళ్ళింది.

వేడి నీళ్ళు ఓ మగ్ లో పెట్టి “,,మొహం కడుక్కో, పడుక్కోకు “ అంటూ బాత్రూం లోంచి వెళ్ళి పోయింది. నేను కడుక్కోలేదు.అలాగే ఉన్నాను. అద్దంలో నా మొహాన్నే చూస్తూండిపోయాను.

అంతలో అమ్మ వచ్చి, మొహం కడుక్కోడంలో సాయం చేసింది.” మెల్లిగా టేబుల్ దగ్గరికి రా” అని వెళ్ళిపోయింది.

అలాగే చేసి, డైనింగ్ టేబుల్ దగ్గరికి వచ్చి కూచోవాలని ఉన్నా కూచోలేకపోయాను. అంతే మళ్ళీ మంచం మీద పడుకుండి పోయాను. చిన్న చిన్న పనులు కూడా చేయలేక పోతున్నాను. కనీసం కూచోవడం కూడా.ఇలా ఓ మొద్దులా. నాకు ఏం రాదు, ఏం చేయలేను. ఇలా మంచం మీద పడుకోవడం ఒక్కటే వచ్చు. మళ్ళీ ఏడుపొచ్చింది. నేనిందుకిలా అయిపోయాను? నా మెదడులో ఏ రసాయన మార్పులు జరుగుతున్నాయి ? దేనిమూలంగా నేనిలా అయ్యాను?

నేను ఆ నేనుని కాను. పదో క్లాసులో స్కూలు ఫస్ట్ వచ్చిన నేను, డిబేట్లలో ప్రైజులు అవీ వచ్చిన నేనుని కాదు. అవి ఏవీ నాకు కాదు. నా చదువు, నా మార్కులు ఎవరికో ! ఇప్పుడు నేను ఆ మనిషిని కాను. ఈ పరిస్థితికి రాజీ పడాలా.! పడకూడదా ! రాజీ పడలేను.

ఎలాగో పదిహేను రోజులు గడిచాయి. వెళ్ళకూడదని అనుకుంటూనే డాక్టరు దగ్గరికి వెళ్ళాను. అదే నవ్వు. అదే పలకరింపు. ఒంటరిగా మాట్లాడాలని అంది. అమ్మా వాళ్ళు బయటికి వెళ్ళిపోయారు. ఒక్కదాన్ని ఆమె ముందు ఉన్నాను.

ఎందుకో భయం వేసింది. కాళ్ళూ చేతులూ చెమటలు పట్టేసాయి. ఆమెని చూడాలంటే భయం వేస్తోంది. నన్ను ఏదో చేస్తుందనిపించింది చంపెస్తుందేమో. భయంతో అరవాలనిపించింది. కానీ అరవ లేక పోయాను. ఆమె మొహంలోకి చూడలేకపోయాను. కళ్ళు దించుకున్నాను. ఆమె నన్ను ఏం అడిగిందో తెలీదు. నేనేం జవాబిచ్చానో తెలీదు. బయట ఉన్న అమ్మా నాన్న ని లోపలికి పిలిచింది.

“ఈ అమ్మాయికి డిప్రెషన్అని చెప్పాను కదా దానికి ఈ ట్రీట్ మెంటు ఇలాగే చెయ్యాలి.”

అమ్మా వాళ్ళు ఏం మాట్లాడ లేదు.అది వాళ్ళకి తెలిసిందే.

“ఇదివరకూ నిద్ర తక్కువగా ఉందని అన్నారు. ఇప్పుడు ఈ మందులకి నిద్ర అదీ బాగా వస్తుంది ”

అమ్మా వాళ్ళు ఏం చెప్తారా అని చూస్తున్నాను.

“అవును డాక్టరు గారూ,నిద్ర బాగా పోతోంది.అన్నీ కంట్రోల్ లో ఉన్నట్లుగానే ఉన్నాయి ”

అమ్మా ,నాన్న గారు నా గురించి సరిగా చెప్పడం లేదు. నిద్ర బాగా పోతోందన్నారు కానీ అది అతి నిద్ర అని నాకే తెలుస్తోంది. ఏమాత్రం చురుగ్గా లేను. మొద్దులా ఉంటున్నాను.

కానీ అమ్మా వాళ్ళన్నట్లుగా నేను కంట్రోల్ లో లేను. నాలో ఓ శవం  ఉంది అది నన్ను ఆక్రమించేస్తోంది. నీ మందులతో నువ్వు నన్ను మెల్లి మెల్లిగా చంపేస్తున్నావు అని గట్టిగా ఆ డాక్టర్ తో అనాలనిపించింది.

“ గుడ్. అదే కావాలి. మరో మందుంది. అది బాగా పనిచేస్తుంది. దాన్ని మొదలు పెడదాం. అది సెరోటోనిన్  లెవెల్స్ ని బాలెన్స్ చేస్తుంది. మూడ్ మీద ప్రభావం చూపిస్తుంది, అరవడం, ఏడవడం, అతిగా యాక్టివ్ గా ఉండడం, కొట్టడం లాంటివి తగ్గిపోతాయి” అంది నన్నుచూస్తు.

“ ముందు రాసినవి వద్దా! ”అని నాన్న అడిగారు.

“ అది తీసుకోవాలి. వాటితో పాటూతీసుకోవాలి. ఇది రియల్ ట్రీట్ మెంటు. దీన్ని వాడాకా ఆ తేడా మీకు స్పష్టంగా తెలుస్తుంది ” అంటూ తల ఎత్తి ,ఊపింది .

దానర్థం మా అందరికీ తెలుసు,  ఇంక చెప్పేందుకు ఏం లేదని.

“  మళ్ళీ” అమ్మ నసుగుతూ అడిగింది.

“ అదేనమ్మా మళ్ళీ పదిహేను రోజుల తరవాత రండి. ఈ లోపల సగం తగ్గిపోతుంది  “

ఇదివరకూ లాగా మందులు కొన్నాక ఇంటికి వెళ్ళాం. మళ్ళీ నాన్న టాబ్లెట్ ,అమ్మ మంచినీళ్ళ సీసాతో నుంచున్నారు.

ఈ కొత్త మందు వేసుకుంటున్నాను కానీ  అది ఏం మందో తెలీదు. కానీ  గొంతు ఎండి పోతున్నట్లుగా ఉంది. ఊపిరి కూడా కొంచెం కష్టం గానే ఉంటోంది. రాత్రి పూట విపరీతమైన దాహం. రాత్రి మంచి  నీళ్ళు తాగడానికి చాలా సార్లు లేవాల్సి వస్తోంది. ఎన్నిసార్లు నీళ్ళు తాగుతున్నానో అన్ని సార్లూ ఆ వెంటనే బాత్రూముకి కూడా వెళ్ళాల్సి వస్తోంది. విపరీతమైన చెమట పట్టేస్తోంది. అంతకు ముందు ఇలా లేదు. ఇప్పుడు నా స్థితి ఇదివరకటి  కన్నా అధ్వాన్నంగా ఉంది. నరకంలోకి వెళ్ళిపోతున్నట్లుగా ఉంటోంది.

“ తల దువ్వుతాను రా “ అంటూ అమ్మ నాచేతికి అద్దం ఇచ్చింది.

జుట్టు పిచ్చిగా చెదరి ఉంది. తలని ఎప్పుడు దువ్వి,జడ వేసుకున్నానో తెలీదు. మొహం రంగు కూడా మారింది ఎండ తగలక పోవడం వల్ల తెల్లగా మారింది. ఆ తెలుపు లో నిగారింపు లేదు. బుద్దిగా తల దువ్వించుకున్నాను.

బతికినన్నాళ్ళూ ఇంతే ఇలాగే ఉండాలా !మరి చచ్చిపోతే ఈ కష్టాలేం ఉండవు కదా ! పైగా ఈ నరకం నుంచి విముక్తి లభిస్తుంది .  విముక్తి పొందాలంటే నేను ఈ లోకంలోంచి వెళ్ళిపోవాలి. ఎలా వెళ్తాను?

ఈ ఆలోచన వచ్చిన ప్రతీసారీ అది సులభం కాదని తెలుసు .సాధ్యం కాదని తెలుసు.అంత ధైర్యం నాలో లేదని కూడా తెలుసు.కాని ఎన్నాళ్ళు ఇలా ?

పదిహేను రోజులు గడిచిపోయాయి.

“రెండు నెలలనుంచి  ఈ సైకియాట్రిస్ట్ శిఖా దగ్గరి కెళ్తున్నాం. నాకు ఆ మందులు  పని చేయడం లేదనిపిస్తోంది.”  అని అమ్మ నాన్నతో అంది.

ఆ సంగతి నాకెప్పుడో తెలుసు అని నా మనసులో అనుకున్నాను. నాకు తెలిసినది వీళ్ళకి తెలియడం లేదు. కాని వీళ్ళకి మాత్రం ఇప్పుడు తెలిసింది..

"అవును ఇంప్రూవ్ మెంటు కనిపించడంలేదు అని అనిపించింది.అయితే డాక్టర్ ని మారుద్దాం "అని వెంటనే అనేసారు.

మరో డాక్టరు,వేరే మందులు.మరో రకం నరకం. నాకు వేరే మార్గం లేదు.వాళ్ళ మాట వినాల్సిందే. నాకు ఛావు రాదు. ఆత్మహత్య చేసుకునే ధైర్యం లేదు. కానీ పదో క్లాసులో ఎలా ప్రయత్నించాను,తెలీదు.

"ఈ సారి మన సిటీ లోనే పెద్ద , గొప్ప సైకియాట్రిస్ట్ ట ,అతని అపాయింట్ మెట్ దొరకడం చాలా కష్టంట. ఆ అపాయింట్ మెంటు కూడా కొన్నివారాల ముందే తీసుకోవాలిట. అలాంటి బిజీ డాక్టరు అపాయింట్ మెంట్ దొరికింది " ఆయన నన్ను చూడడానికి డేటు ఇచ్చాడని అమ్మా,నాన్న సంతోషించారు. పైగా అదృష్టం అని అన్నారు.

కాని నాకు అలాంటి కృతజ్ఞతా భావం రాలేదు. సంతోషం కూడా కలగలేదు. ఓ మొద్దులా ఉన్నాను, నాకు ఫీలింగ్స్ ఏం లేవు.

ఆ డాక్టరు క్లినిక్ ఓ పెద్ద కాంప్లెక్స్ లో ఉంది. ఆ కాంప్లెక్స్ లో అన్ని రకాల డాక్టర్లూ ఉన్నారు. ఈ డాక్టరు సాయంత్రం మాత్రమే ఉంటాడు. పగలు మరో నాలుగు చోట్ల ఇతర ఆసుపత్రులలో పని చేస్తాడుట.

ఈ గొప్ప డాక్టరు క్లినిక్ కి వెళ్ళాం.అక్కడో ఓ అర డజను బోర్డులున్నాయి.అదే క్లినిక్ లో ఓ ఫిజియో థెరపిస్ట్,ఓ స్కిన్ స్పెషలిస్ట్, ఓ ఎముకల డాక్టరు, ఓ ఫిజీషియన్ వాళ్ళ టైమింగ్స్ ప్రకారంగా ఒకళ్ళ తరవాత మరొకరు వస్తూంటారు. అక్కడున్న క్లినిక్ లన్నీ అలాంటివే ,అందుకే ఒక్కొక్క క్లినిక్ పైన నలుగురు ఐదుగురు డాక్టర్ల పేర్లున్నాయి.

మేము వెళ్ళగానే ,అక్కడున్న ఓ అబ్బాయి నా పేరూ వయసూ అదీ ఓ పేపర్ మీద రాసుకున్నాడు. అంతలో ఫోన్ మోగింది. ఆ అబ్బాయి తీసాడు. అవునండి ,ఇప్పుడుండరు,ఆ డాక్టరు పగలు పన్నెండు గంటలకి వస్తారు. మీరు మీ ఫోన్ నంబరు ఇవ్వండి, నేను రేపు మీకు డాక్టరు గారు వచ్చాకా ఫోన్ చేస్తాను. అంటూ పెట్టేసాడు. మరో ఫోను, పేపరు మీద వాళ్ళ పేరు రాసుకున్నాడు. వాళ్ళకి నంబరు ఇచ్చాడు. అక్కడున్న డాక్టర్లందరికీ కలిపీ ఈ అబ్బాయి ఒక్కడే రిసెప్షనిస్ట్ అయి ఉంటాడు.అందుకే అన్ని ఫోన్లకి సమాధానాలిస్తున్నాడు. .

అది ఓ పెద్ద మలిగి. మన ఇళ్ళల్లోని చిన్న హాలులా ఉంది. దాన్ని సగం చేసారు. ఓ వైపున వరసగా నాలుగు విజిటర్స్ కుర్చీలున్నాయి. మిగిలిన సగంలో వరసగా నీట్ గా పార్టిషన్లున్నాయి. ఒక్కొక్క పార్టిషన్ పైన డాక్టరు పేరు, టైమింగ్స్ రాసి ఉన్నాయి. డాక్టరు రూం చిన్నది, కానీ నీట్ గా ఉంది. మేము వెళ్ళిన సమయం ఈ సైకియాట్రి డాక్టరుది. అక్కడ ఎదురు చూస్తున్నవాళ్ళు ఈ డాక్టరు కోసమే. అపాయింట్ మెంట్ ఉన్నా మేము వెయిట్ చేయాల్సి వచ్చింది.

"ఇంత పెద్ద పేరున్న డాక్టరు క్లినిక్ ఇంత చిన్నగా ఉందేంటి అని అమ్మ నాన్నతో అంటోంది.నాలుగు చోట్ల క్లినిక్ లున్నాయంటే చిన్నవే ఉంటాయి.పెద్దవి ఎందుకు పెట్టుకుంటారు "

లోపల ఉన్న మనిషి ఎవరో కాని చాలా సమయం తీసుకుంది. మమ్మల్ని పిలిస్తే మేము ముగ్గురం లోపలికి వెళ్లాం. ముగ్గురం వెళ్ళేసరికి గది మరీ ఇరుకైపోయింది. మమ్మల్ని చూడకుండానే కూచోమన్నాడు. కూచున్నాం. మనిషి సన్నగా పొడుగ్గా.తెల్లగా బాగానే ఉన్నాడు. కాని నాకేం నచ్చలేదు, మొహంలో సౌమ్యత తక్కువనిపించింది. ఆయన నాతో ఏం మాట్లాడ లేదు. తలెత్తి నా ఎదురు గానే నాన్నగారితో మాట్లాడాడు.

అంతకు ముందు డాక్టరిచ్చిన రిపోర్టులు అవీ చూసాడు. మందులు రాసాడు . ఆ ప్రిస్క్రిప్షన్ నాన్నగారి కిస్తూ మా మొహాల్లోకి చూసాడు.

ఇలా మందులూ అవీ వాడినా మీకు ఫలితం కనపడకపోతే ,మరోసారి ఈ మందులూ అవీ వాడే కన్నా , నేను మీకు ఓ సలహా ఇస్తాను. మీరు మీ అమ్మాయిని హాస్పిటల్ కి తీసుకెళ్తే మంచిది. ఎక్కడో బెంగలూరు వెళ్ళక్కర్లేదు, మన దగ్గర కూడా మంచి సెంటర్ లున్నాయి. మెంటల్ హెల్త్ అండ్ న్యూరోలాజికల్ సైన్సెస్ కి తీసుకెళ్తే మంచిది.

ఇంతేనా! అంటే ఈయన వల్ల కాదని ఒప్పుకుంటున్నాడా. ఇన్ని రోజులు వెయిట్ చేయించి, అంత డబ్బు తీసుకుని ఈ సలహా ఇవ్వడానికేనా ?

రోజులు గడుస్తున్నాయి. నాలో మార్పు ఏం లేదు.అలసిపోవడం,ఆకలి లేకపోవడం, నిద్ర లేకపోవడం, మత్తు, కలత నిద్ర,బద్ధకం, అన్నీ అలాగే ఉన్నాయి నాలో నిరాశ ఇంకా ఎక్కువైంది. మాట్లాడాలంటే ఎక్కడ లేని నీరసం వచ్చెస్తోంది. మాట్లా డాలనిపించడం లేదు.

కాలేజీకి ఎందుకు వెళ్ళ లేకపోతున్నానో ఎవరికీ చెప్పలేక పోతున్నాను. ఎవర్నీ చూడాలని అనిపించడంలేదు. స్కూల్లో ఉన్నప్పుడు ఎన్నో జోక్స్ వేసేదాన్ని. ఇప్పుడు అదేం లేదు.అసలు ఓ చిన్న వాక్యం కూడా మాట్లాడ లేక పోతున్నాను.ఎందుకీ బతుకు...!.నేను ఉండడం దండగ.ఛావాలి అన్న కోరిక రోజు రోజుకి ఎక్కువైపోతోంది.

ఆత్మహత్య ఎన్ని విధాలుగా చేసుకోవచ్చో ఆలోచిస్తున్నాను. బతకడానికి ఎన్ని మార్గాలున్నాయో, ఛావడానికి కూడా ఎన్నో మార్గాలున్నాయి.

విషం తీసుకోవడం. ఎండ్రిన్ లాంటి పురుగుల మందు తాగడం. ప్చ్ లాభం లేదు.వెంటనే తెలిసిపోతుంది. ఆసుపత్రికి తీసుకెళ్తారు. డాక్టర్లు వెంటనే కడుపుని సుబ్బరంగా క్లీన్ చేస్తారు. ఇప్పుడు ప్రాణ భయం ఏం లేదు. ఓ సారి అనుభవం అయింది.అందుకని అలా అని అనడానికి బతకడానికే అవకాశాలే ఎక్కువ.

మణికట్టు దగ్గర కోసుకుంటే . అలా కోసుకున్నచేతిని నీళ్ల టబ్ లోనో వాష్ బేసిన్ లోనో ఉంచితే ఆ రక్తం పోతూంటుంది. అలా చచ్చి పోవడం సినిమాల్లో చూపిస్తూంటారు. మా ఇంట్లో బాత్ టబ్ లేదు, వాష్ బేసిన్ కష్టం. ప్రాణం పోయే వరకూ నుంచోవాలి. బక్కెట్ తో సరిపెట్టచ్చు. కానీ బాత్రూం అంతా అసహ్యంగా అవుతుంది. పైగా ఈ మెథడ్ చాలా స్లో. శ్వాస ఆగేవరకూ ఆ చేతిని నేను అలాగే నీళ్ళల్లో ఉంచాలి ఈ లోపలే ఎవరో వచ్చెస్తారు . ఇల్లు ఏం పెద్ద మహల్ కాదు. అమ్మో,నాన్నో, ఎవరో ఒకరు చూస్తారు. లాభం లేదు.

కిరసనాయిలు పోసుకుని కాల్చుకుంటే. కిరసనాయిల్ ఇంట్లో ఉండదు. పనిమనిషికి రేషన్ లో ఇచ్చే కోటా లోంచి తీసుకోవాలి. అది వెంటనే అమ్మకి చెప్పడానికి వెనకాడదు. అప్పుడందరికీ తెలుస్తుంది. ఒకవేళ ఎవరికీ తెలీకుండా మేనేజ్ చేసి కిరసనాయల్ తెచ్చుకుని కాల్చుకుంటే. అమ్మా వాళ్ళు నా ఉత్తరాలు కాల్చేసినట్లు. ఇది కూడా సందేహమే. ఇందులో ఫెయిల్ అవడానికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి . టీవీల్లో ఎన్నోసార్లు , ఎంతోమంది ఫోటోలు వీడియోలూ చూసాను. పూర్తిగా కాలక పోతే ఎలాంటి నరకాన్ని అనుభవించారో చూసాను. నేను కూడా అలాగే. ఛావక పోతే! లోపలంతా వంకాయ కాలినట్లుగా అయిపోతే! పూర్తిగా మొహం మారిపోతే ! ఆ బాధని భరించడం కష్టం. పోని,సీలింగ్ ఫాన్ కి ఏ తాడో, ఏ చీరో తీసుకుని ఉరేసుకుంటే. ?

ఒక్కసారి రజని గుర్తొచ్చింది. సునీత గుర్తొచ్చింది. హటాత్తుగా వాళ్ళిద్దరే ఎలా గుర్తున్నారు? కారణం ఇద్దరూ కూడా హాస్టల్ గదిలో ఉరి వేసుకుని పోయారు. పోలీసులు వచ్చి,కేసుని తీసుకునే వరకూ వాళ్ళిద్దరి శరీరాలూ అలా వేళ్ళాడుతూనే ఉన్నాయి. ఆ సంఘటనల తరవాత చాలా రోజులు నిద్ర పట్టలేదు భయంతో నిద్ర పోలేదు. వాళ్ళు ఎందుకు చచ్చిపోయారో. మాకు అర్థం కాలేదు. ఊగుతున్న శరీరాలు.కళ్ళు పైకొచ్చి,నోరు తెరుచుకుని ఉన్న వాటిని దింపడాలూ, ఎంత భయంకరంగా మారిపోయారో! మమ్మల్ని ఎన్నో ప్రశ్నలు. అంతా గొడవ గొడవ . ఉహూం నేనలా చావను.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments